# అందని ఆకాశం

అది అర్ధరాత్రి సమయం. ప్రకృతి చల్లగా ఉంది. కాని వీరిగాడి శరీరం నూటరెండు డిగ్రీల జ్వరంతో పేలిపోతోంది. వాడికి నిద్ర పట్ట డములేదు. చాపమీద అటూ ఇటూ దొర్లుతున్నాడు. రాత్రి వేణ్నీళ్ళతో మింగిన మాత్ర జ్వరాన్ని ఇసుమంత కూడా తగ్గించలేదు. దానికితోడు సాయంత్రం అప్పలకొండ చెప్పిన విషయాలు ఆలోచించే కొద్దీ వాడి శరీ రము కొలిమిలో కాగే ఇనుపముక్కలా మండుతూ వుంది. వీరిగాడికి పంతొమ్మిదేళ్ళు నిండాయి. వాడి స్నేహితుడు అప్పలకొండ వయసూ అంతే. ఇద్దరూ రెండేళ్ళ నుంచీ రిక్షాలు లాగుతున్నారు.

అయితే ఇద్దరిలోనూ చిన్న తేడా వుంది వీరిగాడికి తండ్రిలేడు. చిన్నతనంలోనే పోయాడు. వాడితల్లి ఆ ఇంట్లో, ఈ ఇంట్లో పాచిపని చేసి వాణ్ని పెంచి పెద్ద చేసింది. వాడుకూడా ఐదేళ్ళ వయసునుంచే తట్టలో వేరుశనక్కాయలు పెట్టుకొని పార్కుల్లో అమ్మి అంతో ఇంతో చిల్లర తెచ్చేవాడు. పదిహేనేళ్ళు వచ్చేసరికి రిక్షాచేత బట్టాడు.

అప్పలకొండ జీవితం కూడా ఇంచుమించు ఇలాంటిదే. అయితే వాడికి తల్లీదండ్రీ ఉన్నారు. తల్లి పాచిపనిచేస్తే, తండ్రి రిక్షాలాగుతాడు. అప్పలకొండ తండ్రి ఎవరికాళ్ళో పట్టుకొని చిన్నతనంలోనే వీణ్ని సినిమా హాలు కాంటీన్‌లో పనికిపెట్టాడు. వాడు కొంత కాలానికి కప్పులు కడిగే దగ్గర్నుంచి టీ వేసే స్థాయికి చేరాడు. హాలు యజమాని వీడి హుషారుకు మెచ్చి సినిమాహాలు బండిలాగే పనికి నియమించాడు. ఆ వైపూ, ఈవైపూ పోస్టర్లు అంటించిన సినిమా బండిలో మైకు పెట్టుకొని ఒక వ్యక్తి కూర్చుంటే, ఆ రిక్షాబండిని తొక్కుతూ వీధులు తిరగడం వీడి పని.

పట్టణంలో ఓ మూలగా వున్న ముఠికివాడలో చెరోమూల ఉంటాయి వీడిగాడి గుడిసె, అప్పలకొండ గుడిసె.

ఆ సాయంత్రం అప్పలకొండ గుడిసెలో దూరాడు.

మాగన్నుగా పడుకొని ఉన్న స్నేహితుడ్ని చూసి, "ఏరా ఈరిగా ఇయ్యాల రిషా ఎయ్యాలా" అనడిగి, పక్కనే చాపమీద కూర్చు న్నాడు.

"జెరంగా ఉందిరా" అన్నాడు వీరిగాడు నెమ్మదిగా కళ్ళు తెరచి.

"ఎప్పట్నుంచి"

"నిన్నట్నుంచిరా"

"నేనప్పుడే అనుకొన్నా. ఈడు ఇసయం తెలిస్తే నా దగ్గరికి రాకుండా ఎట్టుంటడాని"

"ఏంటిరా ఇసయం" ఆశ్చర్యంగా అడిగాడు వీరిగాడు.

"అదేరా, మనూళ్ళో మాంచి ఇంగ్లీసు బొమ్మ వచ్చుండాది" అంటూ అటూ ఇటూ చూసి, "సెక్సు పిలుము" అన్నాడు అప్పలకొండ రహస్యంగా.

"నాయాల్ది ఇంకో నాలుగు రోజులు ఆడద్ది కదరా. ఈ లోపల నా జెరం తగ్గిపోద్దిలే" అన్నాడు వీరిగాడు ఆశగా నాలుక చప్పరిస్తూ.

"ఆడద్దనుకోరా, ఇంగ్లీసు బొమ్మలతో ఒకటే పేసిరా. బొమ్మ సెక్సు గుండిందంటే జనం ఇపరీతంగా సూత్తారు. వాళ్ళు సూసిన వరస సూసి, ఇంకోళ్ళు సూస్తారనే బాద్తో ఆ సీనులు అసయంగా ఉండా యని, ఆటిని కట్ సేయాలని ఈదుల్లో వూరేగింపులు జేస్తరు దాంతో మాంచి పసందైన సీన్‌లు గవర్నమెంటోళ్ళు కత్తిరించి పడేత్తరు. ఇక

మన కంటికి దక్కేది ఒంటినిండా గౌన్‌లు ఏసుకున్న దొరసాన్లే" అన్నాడు విచారంగా.

"ఈ బొమ్మకింకా అట్టాంటియేం జరగలేదు కందా" అన్నాడు వీరిగాడు భయం భయంగా.

"ఎట్టా చెప్పేది. బొమ్మ అదుబుతంగా ఉండాది. ముగ్గురు హీరో యిన్‌లుండారు. ముగ్గురూ మూడు లోకాలకు అందగత్తెలనుకో. ఆళ్ళ ఒంటిమీద ఒక సోట బెత్తెడు గుడ్డ, ఇంకోసోట ఏలెడు గుడ్డ తప్ప ఇంకేం లేవు. అట్టాటి బొమ్మని నేనిప్పటి వరకు సూళ్ళేదనుకో."

వీరిగాడికి నోట్లో నీళ్ళూరి చొంగకారుతోంది.

"ఇయ్యాల ఉదయం ఏటయిందనుకొన్నావు ఆడా మగా గుంపుగా చేరి ఏదో రాసిన అట్టలు పట్టుకొని ఈదుల్లో తిరిగి బొమ్మను బాన్ చేయా లని అర్సింద్రు"

"అయితే ఆట మార్చేస్తరా...నిరాశగా అడిగాడు వీరిగాడు. నోటిదగ్గర కొచ్చిన ముద్ద కడుపులోకి బోలేదన్నంత బాధగా.

"అట్టాంటిదేం జరగదుకానీ, బంగారం లాంటి సీన్‌లు పోతాయనిరా నా బాధ...

"నాకు అయితే చూసే అదృష్టం లేకపోయినే—ఏడ్చినంత పని చేసాడు వీరిగాడు.

"ఒరే ఆ సీన్‌లు కట్‌చేసే సరికి రెండు రోజులు పట్టద్ది రేపు జెరం తగ్గితే ఎళ్ళు ఏం? ఇడిసి పెట్టకు" అంటూ వాడు నిక్కరు జేబు లోంచి మడతలమీద మడతలు పెట్టిన కాగితం తీసి విశాలంగా పరిచాడు.

అది వాడు చెప్పిన సినిమాకు సంబంధించిన వాల్ పోస్టరు.

అందులో అందంగా ఉన్న ఒక స్త్రీ తొంభయ్యేపాళ్ళు నగ్నంగానిలబడివుంది. ఆమె వక్షస్థలం మీద మొనల్ని మాత్రమే కప్పుతూ రెండంగుళాల వెడల్పున్న పట్టీలాంటి బ్రా వుంది. అదే విధంగా ముందు భాగంలో బొడ్డు క్రింద బెత్తెడు వెడల్పున్న కట్ డ్రాయరుంది. ఆమె నడుంచుట్టూ ఆ కట్ డ్రాయరును కలిపే బొందు వక్కని దారంలా ఉంది. అదీ ఆమె డ్రస్సు. ఆమెకు ఒక ప్రక్కగా మోకాళ్ళమీద కూర్చొని వున్న ఒక వ్యక్తి ఆమె నడుము మీద ముద్దు పెట్టు కొంటున్నాడు.

"ఇది నువ్వుంచుకోలే. నానిక ఎల్లొస్తాన్రా" అంటూ అప్పల కొండ వెళ్ళిపోయాడు.

అప్పట్నుంచీ వీరిగాడు మనసు మనసులో లేకుండా పోయింది. ఆ రాత్రి బుడ్డి దీపం క్రింద ఆ బొమ్మని ఎంతోసేపు చూసాడు. ఆలోచనలతో వాడు నిద్రపట్టక రాత్రంతా చాపమీద దొర్లుతూనే వున్నాడు. వాడికి కొద్ది దూరంలో పాత చీర పరచుకొని రొయ్యిలా ముడుచుకొని నిద్రపోతోంది వాడి ముసలి తల్లి.

ఆ రాత్రి నిద్రపట్టని వీరిగాడు మసక చీకటిలోనే లేచి కాళ్ళీడ్చు కొంటూ నాయరు టీ కొట్టు దగ్గరకు వచ్చాడు. అంతకు అరగంట ముందే లేచిన నాయరు స్టవ్‌మీద పాలు మరగపెడుతున్నాడు. కొద్ది దూరంలో వున్న వీధి కొళాయి దగ్గర పని కుర్రాడు పాత్రలు, గ్లాసులు కడుగుతున్నాడు.

టీ కొట్టు ముందున్న బెంచీమీద కూర్చొన్నాడు వీరిగాడు.

"ఇయ్యాల నువ్వేనా టీకి బోణీ" అన్నాడు నాయరు లోపల్నుంచి సినిమా పోస్టరున్న తడికబోర్డు కొట్టుముందు పెడుతూ.

ఆ బోర్డు చూసిన వీరిగాడికి గుండె గొంతులో కొట్టుకోసాగింది.

అందులో ముగ్గురు స్త్రీలు నిలబడి వున్నారు. ఒకామె ఎర్రగా వుంది. ఇంకొకామె తెల్లగా వుంది. మధ్యలో ఉన్నామె నల్లగా వుంది. ఎర్రగా వున్నామె పసుపు రంగు కట్ డ్రాయరుతో వుంది. నల్లగా వున్నామె తెల్ల కట్ డ్రాయర్‌తో, తెల్లగా వున్నామె నల్ల కట్ డ్రాయరుతో వుంది. ఎర్రగా వున్నామె జుట్టు నల్లగా వుంటే, నల్లగా ఉన్నామె జుట్టు తెల్లగా వుంది. తెల్లగా వున్నామె జుట్టు ఎర్రగా వుంది. అందరూ మధ్యనంలో వున్న స్త్రీలే. చిలిపిగా నవ్వుతూ ఆహ్వానిస్తున్నట్లు ఉన్నారు.

"ముగ్గురూ మూడు రకాలయిన బంగారాలు. ఇదేటి సినిమానో అప్పలకొండ సెప్పిన దానికంటే ఈ బొమ్మ బాగున్నట్టుండాది. ఏడాడు తన్నదో" మనసులోనే అనుకున్నాడు వీరిగాడు.

వాడి వాలకం గమనిస్తున్న నాయరు "అది మీ అప్పలకొండ హాల్లో ఆడే ఆటే. మా బాగుంటదిలే" అన్నాడు కళ్ళెగరేస్తూ, అప్పటికి అప్పలకొండకేదో సొంత థియేటరున్నట్లు

నాయరు మాటలకు ఏం సమాధానం చెప్పలేదు వీరిగాడు

కాని దృష్టిని బొమ్మమీద నుంచి మాత్రం తిప్పలేదు. 'అయితే ఈ సీనుకూడా అప్పలకొండ చెప్పిన సినిమాలోదే అన్నమాట' అనుకొన్నాడు.

"ఒరే మాద్రా అళ్ళెక్కడ? మనమెక్కడ! అళ్ళు మనకి ఎన్నో వేల మైళ్ళ దూరంలో ఉన్నారు రానూ పోనూ చార్జీలే ఇక్కడ్నుంచి ఇరవై వేల రూపాయలవుతాయి. ఇంత కష్టపడి అక్కడ కెళ్ళినా అళ్ళు ఎక్కడ ఎ.సి కార్లలో తిరుగుతుంటారో, ఎక్కడ హెలికాప్టర్లలో ఎగురుతుంటారో, ఎళ్ళినా నీకు ఇలా గుడ్డలిప్పి చూపిస్తరంటరా ఎన్ని లక్షలిచ్చినా" అన్నాడు నాయరు గరిటతో పాలు కలియబెడుతూ.

నాయరు మాటల్లో అబద్ధం ఏ మాత్రం లేదనుకొన్నాడు వీరిగాడు.

"అందుకే ఎల్లిసూద్రా. రూపాయి పావలాతో రవ్వల బొమ్మల్ని" అన్నాడు నాయరు ప్రోత్సహిస్తూ.

"మసక చీకట్లు పూర్తిగా విడిపోయాయి. ఎవరో ఇద్దరు వచ్చి టీ తాగి వెళ్ళిపోయారు.

"నాకో టీ ఇయి నాయరో" అన్నాడు వీరిగాడు.

నాయరు టీ వేసి ఇచ్చాడు. వీరిగాడు టీ తాగి నాయరు చేతిలో అర్ధరూపాయి పెట్టి ఇంటివైపు కదిలాడు.

గుడిసె దగ్గరకు వెళ్ళే సరికి వాడి ముసలి తల్లి పాచిపనికి వెళ్ళ డానికి సిద్ధమై కొడుకు కోసం ఎదురు చూస్తూ వుంది.

"ఏడికి పోయినావురా బాగాలేని మడిసివి" అంది ఆదుర్దాగా.

"ఇప్పుడు జెరం తగ్గిపోయిందిలే. అలా నాయరు కొట్టుకెళ్ళి టీ తాగి వత్తున్నా" అన్నాడు.

వీరిగాడి తల్లి వాడి మెడ క్రింద, గుండెల మీద చేయిపెట్టి చూసి, ఇంకా జెరం తగ్గలేదురా నాయనా. ఏడిగానే వుండాది. ఈ రోజు కూడా గుడిసెలోనే పడుకో. సాపకింద మాత్ర ఎట్టినా, అనక ఏసుకో" అంది.

"తగ్గిపోయింది లేయే ఇయ్యాల పనికెల్తా" అన్నాడు వీరిగాడు.

"ఒరే నామాట ఇనా, రేపట్నుంచి ఎల్దువుగాని ఇయ్యాల గుడిసెలో గమ్మునే పడుకో" అని వాడ్ని ఒప్పించి వెళ్ళిపోయింది తల్లి.

ఎలాగో ఓ గంటసేపు కూర్చొన్న వీరిగాడు ఇక ఉండలేక

పోయాడు. చాపక్రింద మాత్ర తీసి జేబులో వేసుకొని, గుడిసెకు తడిక పెట్టి బయలుదేరాడు

మురికివాడ చివరకు వెళ్ళి అప్పులమ్మ కొట్లో నాలుగు ఇడ్లీలు పెట్టించుకొన్నాడు. నోరంతా చేదుగావుంది. రెండు ఇడ్లీలకంటె ఎక్కువ తినలేకపోయాడు. తరువాత మాత్రవేసుకొని కాఫీ త్రాగి చిన్నగా నడుచు కొంటూ బజారుకు వచ్చాడు అక్కడ వీరిగాడి రిక్షా ఓనరు వున్నాడు. ఆయనన్నడిగి మధ్యాహ్నం వరకు రిక్షా తీసుకొన్నాడు

తరువాత రిక్షా బెల్ గణగణమని మ్రోగించుకుంటూ వీథుల్లో తిరగడం మొదలుపెట్టాడు. ఎక్కడా బాడుగ తగల్లేదు రిక్షా తొక్కు తుంటే కాళ్ళు పీక్కుతున్నాయి. ఒళ్ళంతా నొప్పులు. కాని వాడి ఆలోచ నంతా ఒకే విషయం మీద కేంద్రీకృతమై వుంది. ఎట్టాగయినా ఇయ్యాల మధ్యాహ్నం ఆ ఆట సూడాల. దానిగ్గాను న్యాలూపాయలు సంపాయిం చాల. రెండు రూపాయలు రిక్షా బాడుగ, రూపాయపావలా నేలటికెట్టుకు, మిగతా ముప్పావలా చిల్లర కర్చుకి. అంటే టీ, బీడి, బస్ అనుకొంటు న్నాడు.

ఇంతలో "ఏయ్ రిక్షా" అంటూ ఎవరో పిలిచారు.

అటు చూసిన వీరిగాడికి పొట్టిగా లావుగా వున్న వ్యక్తులు ఇద్దరు కన్పించారు.

రిక్షా తీసుకెళ్ళి వారి ప్రక్కగా ఆపాడు.

"ఆర్. టి. సి. బస్టాండుకు ఎంత తీసుకొంటావోయ్" అడిగాడు మొదట పిలిచి నాయన.

"మూడ్రూపాయలండీ" అన్నాడు వీరిగాడు.

"ఏంది మూడు రూపాయలా" కీచుగా అరిచాడు రెండో వ్యక్తి.

"అవును సారూ ఈడికి మైలు దూరముంది ఆర్. టి సి. బస్టాండు."

"వద్దులే పోవయ్యా. మేం ఆటోలో వెల్తాం. రెండు రూపాయలతో పోతుంది" అన్నాడు మొదటి వ్యక్తి తిరిగి.

వాళ్ళిద్దరూ రోడ్డుమీద ఏదయినా బస్సు వస్తుందేమోనని చూడ సాగారు.

వీరిగాడిలో నిరాశ మొదలయింది. వచ్చిన బేరం పోగొట్టుకోవడం వాడికి ఇష్టం లేదు.

"అట్టాగే రెండు రూపాయలే యియ్యండి" అన్నాడు.

ఇద్దరూ విజయగర్వంతో వచ్చి రిక్షాలో ఎక్కారు.

ఒక్కొక్కరు వంద కేజీల బరువున్నారు. రిక్షా తొక్కుతున్న వీరిగాడి ఒళ్ళు గాలిలో తేలిపోసాగింది. అయినా పళ్ళు బిగువున మొండిగా తొక్కుతున్నాడు.

వీరిగాడు వాళ్ళని ఆర్. టి. సి. బస్టాండు దగ్గరకు చేర్చేసరికి ఉన్న శక్తి ఊడ్చుకు పోయినట్లనిపించింది. ముందే రెండు రోజుల్నుంచి జ్వరం. దానికి తగ్గట్టు ఆహారం లేదు. ఉదయం తిన్న రెండు యిడ్లీలు ఎటుపొయ్యాయో అంతులేదు. ఇప్పుడు ఏం తినాలన్నా నోరు చేదుగానే వుంది. జ్వరం ఎక్కువయింది. వాళ్ళిచ్చిన రెండు రూపాయలు మాసి పోయిన పాంటు జేబులో వేసుకొని ఆర్. టి. సి. బస్టాండుకెదురుగా వున్న వేపచెట్టు క్రింద కూర్చుని కొద్దిసేపు ఆయాసం తీర్చుకొన్నాడు.

తరువాత చాలా సేపటికి మార్కెట్‌కి ఒక గిరాకీ తగిలింది. అక్కడికి వెళ్తే మూడు రూపాయలు వచ్చింది. మళ్ళీ బాడుగ దొరక

లేదు. వాడి దృష్టంతా సినిమామీదనే వుంది. అందమైన ఆడవాళ్ళ శృంగార దృశ్యాలను ఎప్పుడెప్పుడు చూస్తానా అని వాడి మనసు ఉద్రూత లూగుతోంది. వాడి కళ్ళముందు ఆ ముగ్గురు సుందరాంగులు బట్టలు విప్పి నాట్యమాడుతున్నట్లున్నారు. గోడలమీదున్న సెక్స్ బొమ్మలు వాణ్ణి అలా వూరిస్తున్నాయి.

వీరిగాడు రొప్పుతూ రొస్తూ బెల్ కొట్టుకుంటూ వీధుల్లో తిరుగుతున్నాడు. గంట గంటకూ ఎండ ఎక్కువవుతూ వుంది. జేబులోని చేతి గుడ్డ తీసి తలకు చుట్టుకొన్నాడు. వాడి అదృష్టం బాగున్నట్లు సరిగ్గా ఒంటి గంటకు ఒక కాలేజీ స్టూడెంటు రిక్షా కుదుర్చుకొన్నాడు. అతను వీరిగాడు రిక్షా ఇవ్వ వలసిన చోటుకే పోవలసి ఉండడంతో ఆనంద పడిపోయాడు వీరిగాడు.

వీరిగాడు ఎర్రటి ఎండలో రిక్షా తొక్కుతున్నాడు. వాడు వేసుకున్న చేతుల బనీను, గిలకలిపైకి మడచిన పాంటు చెమటతో ముద్దగా తడిసిపోయాయి. ఊగుతూ, ఊగుతూ తొక్కుతున్న వీరిగాడు కాలేజీ స్టూడెంటును పలుకరించాడు.

"సామే! ఆ సినిమా పేరేంది." కొద్ది దూరంలో సెక్స్ బొమ్మలతో గోడమీద అంటించబడి వున్న వాల్ పోస్టరును చూపిస్తూ అడిగాడు.

"అది ఇంగ్లీష పిక్చరు" స్టయిలుగా అన్నాడు కాలేజీ స్టూడెంటు.

"పేరేంది సామే"

"నీకు ఇంగ్లీషులో చెబితే అర్థంకాదుగాని, తెలుగులో చెప్తా విను. తెలుగులో దానర్థం 'అందని ఆకాశం' అని."

"హై...హై...పేరు మా బాగా వుంది సామే. నేలమీద ఇంతెత్తు నుండే మనకు ఆకాశం ఎట్టందద్దీసామే" అన్నాడు వీరిగాడు హుషారుగా.

ఇంతలో అతను దిగవలసిన చోటు వచ్చేసింది.

"ఇక్కడాపు ఇక్కడాపు" అరిచాడు కాలేజీ స్టూడెంటు.

అతను చెప్పిన యింటి గుమ్మం ముందు రిక్షా ఆపాడు వీరిగాడు. స్టూడెంటు కుర్రాడు బాడుగ యిచ్చి దిగిపోయాడు.

రిక్షా ఓనరుకు రిక్షా యిచ్చి అద్దె చెల్లించాడు. ఇక వాడి దగ్గర నాలుగు రూపాయలే వుంది.

వాడు తేలిపోయే శరీరాన్ని అదుపులో పెట్టుకొని మెల్లిగా అడుగు లేస్తూ థియేటరు దగ్గరకు చేరుకొన్నాడు. థియేటరు గేట్లు యింకా తీయ లేదు. గేట్లముందు తనలాంటి నేలటికెట్ల జనం బోనులోని కోతుల్లా గేటు కమ్ములు పట్టుకొని లోపలకు చూస్తున్నారు. టికెట్లు దొరుకుతాయనే ఆశ పోయింది వీరిగాడికి.

వీరిగాడు ఆ థియేటరుకు ఎదురుగా ఉన్న ఒక అంగట్లో బన్ రొట్టె కొని ప్రక్కనే వున్న టీ కొట్టులో ఒక కప్పు పాలకి ఆర్డరిచ్చాడు. టీ కొట్టు ముందున్న పందిట్లో నిలబడి పాలలో అద్దుకొంటూ బన్ ముక్కలు తిన్నాడు. అవి కడుపులోకి పోవడం లేదు. అయినా బల వంతంగా వాటిని కడుపులోకి ఎక్కించాడు. వెంటనే వాంతి చేసు కున్నాడు. గ్లాసుడు నీళ్ళు పుక్కిలించి, తరువాత థియేటరు వైపు నడి చాడు. వాడికి తెలుసు. ఇంగ్లీషు పిక్చరయినా సెక్సు బొమ్మలుంటే చాలు. తనలాంటి నేల టికెట్ల జనం తన్నుకుంటారని. అందుకే వాడు గుంపులో దూరి క్షణంలో గుంపు మధ్యలో తేలాడు.

కొద్ది సేపటికి గేట్లు తీసారు. జనం ఒక్కసారిగా త్రోసుకుంటూ

లోపలికి వెళ్ళారు. లోపలకు వెళ్ళిన వాళ్ళు క్యూలో జొరబడడం మొదలు పెట్టారు ఆ జొరబడడంలో జ్వరంతో బలహీనంగా వున్న వీరిగాడ్ని అందరూ వెనక్కు నెట్టేశారు. ఐతే వీరిగాడికి కళ్ళముందు సుంద రాంగులు నిలబడి ఆహ్వానిస్తుండడంతో వాడికి ఎక్కడలేని ఆవేశం ముంచుకొచ్చింది. తల ముందుకు పెట్టి పొట్టేలులా కుమ్మి క్యూ మధ్యలో చేరిపోయాడు.

ఎలాగో ప్రాణం ఉగ్గ పట్టుకొని టికెట్టు సంపాదించాడు తరువాత క్షణంలో హాల్లో వున్నాడు. అది ఎ. సి థియేటరు ఆ థియేటరు ఎంత చల్లదనాన్ని కలిగిస్తున్నా వాడి శరీరంలో వేడి మాత్రం తగ్గటంలేదు. సినిమా మొదలయింది. వీరిగాడి ఆనందం అంతా ఇంతా కాదు ఎప్పు డెప్పుడు ఆ సుందరాంగులను నగ్నంగా చూద్దామా అని ఆత్రుతగా ఎదురు చూస్తున్నాడు. వాల్ పోస్టరులోని ఆ ముగ్గురు స్త్రీలు కనిపిస్తు న్నారుగానీ, నగ్నంగా కనిపించడం లేదు.

ఇంతలో ఇంటర్వెల్ అయింది. ఇంటర్వెల్ అయిన తరువాత నయినా ఆ దృశ్యాలు కనిపిస్తాయేమోనని కళ్ళలో వత్తులు వేసుకొని చూస్తున్నాడు వీరిగాడు. సినిమా జరిగిపోతూ వుంది. కొద్ది సేపటికి ప్రేక్షకులు ఒక్కసారిగా పైకి లేచారు అంతలో హాల్లో లైట్లు వెలిగాయి. అంటే సినిమా ఐపోయిందన్నమాట.

వీరిగాడి అంచనాలు తారుమారయ్యాయి. వాడి గుండె బరువైంది. వాడి ఆశ అందని ఆకాశమైంది. 'అంటే సెక్సు సీన్లు కట్ చేసిన్రన్న మాట' ఓరి దేముడో ఇంత కష్టపడి, ఇంత జెరంలో, ఇన్ని బాధలుపడి సినిమాకొస్తే, బెమ్మాండమైన సీన్లన్నీ కట్ చేసిన్రు. నా నోట్లో దేముడు మన్నేసిండు' లబ లబా కొట్టుకొంటూ ఏడ్చాడు వీరిగాడు.

అప్పుడు వాడికి నడవడానికి కూడా శక్తి లేదు. తన దురదృష్టాన్ని నిందించుకొంటూ కంటికి కడివెడుగా దుఃఖిస్తూ తను నిన్నంతా జ్వరంలో ఉండినందుకు బాధపడుతూ, శూన్యమైన మనసుతో కడుపులోని మంటకు ఒళ్ళు తేలిపోతుంటే రోడ్డుమీద ఒక ప్రక్కకు ఒరిగిపోయాడు వీరిగాడు.

అదే దారిన ఖాళీ రిక్షాలో వెళుతున్న వీరిగాడి ప్రక్క గుడిసె ఏసేబు రోడ్డుప్రక్కన ఎండలో కూలిపోయిన వీరిగాడ్ని చూసాడు. వెంటనే రిక్షా ఆపి, వాడ్ని రిక్షాలో కుర్చోపెట్టుకొని మురికివాడ వైపు ప్రయాణమయ్యాడు.

❋